www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 3 జూన్ 2025

హెచ్ఐవిపై అవగాహన

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, కోర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కె.సి.నటరాజ్ కళాబృందంచే నిర్వహించారు. గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లో వీది నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్ఐవిఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవిఎయిడ్స వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి పేర్కొన్నారు. హెచ్ఐవి, క్షయ, సుఖవ్యాధులు, చికిత్స , కండోమ్ ఉపయోగవం గుంచి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిల్, ఎల్ డబ్ల్యు సంస్థ సిబ్బంది మహబూబ్ బాషా, అల్లావల్లి డిఆర్‌పి పిసిఎస్ సంస్థల సభ్యులు స్వాతి, చంద్రకళ, నాగేశ్వరమ్మ, ఖాదరవల్లి, కళాకారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాను క్షయ వ్యాధి రహితంగా రూపొందించడమే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "టిబి.ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. టిబి రహిత భారత్‌కు సహకరించాలని పిలుపు నిచ్చారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రామ్‌ను మన జిల్లాలో ప్రారంభించామని చెప్పారు. ప్రాథమిక దశలోనే టిబి వ్యాధిని గుర్తించి చికిత్స చేయడం, క్షయ వ్యాధి వ్యాప్తిని నిరోధించడం, క్షయ వ్యాధి వల్ల కలిగే మరణాలను తగ్గించడం, 2027 సంవత్సరం నాటికి భారతదేశంలో క్షయ వ్యాధిని నిర్మూలించడం లక్ష్యంగా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వారాలు, జ్వరం, రాత్రి చెమటలు, హెమోప్టిసిస, ఛాతి నొప్పి, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం, అలసట, మెడలో వాపు, ఇతర అదనపు, ఊపిరితిత్తుల సంకేతాలు, లక్షణాలన్నారు. ఏడు రకాల లక్షణాల్లో ఏఒకటి లేకపోయితే ఎక్స్‌రే చేయించాలని సూచించారు. ఎక్స్-రే టెస్ట్ చేయడం ద్వారా వ్యాధి నిర్ధార చేసుకోవచ్చన్నారు. అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శైలజ పేర్కొన్నారు. టిబి వ్యాధిగ్రస్తులకు ఆరు నుండి ఎనిమిది నెలలు పాటు పోషకాహారం అందించడానికి క్షయ మిత్రలు వారిని దత్తత తీసుకొని వారికి పోషకాహారం కోసం నెలకు రూ.500 నుంచి రూ.700 వరకు అలా ఆరు నెలలకు రూ.3 వేలు నుంచి రూ. 4200 వరకు ఒక్కొక్క టిబి వ్యాధిగ్రస్తులకు ఆర్థిక సహాయం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నేటి నుండి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ రాజేంద్రన్ ఒక్కొక్కరు ముగ్గురు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని వారి పోషకాహారం కోసం తమ సొంత నిధులు రూ.10 వేలు అందించారు. డిఆర్ఒ మధుసూదన్‌రావు, ఆర్‌డిఒ శ్రీనివాసులు ఒక్కొక్కరు ఇద్దరి చొప్పున దత్తత తీసుకుని రూ.5వేల అందించారు. జిల్లా అధికారులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతుగా తోచిన మేరకు ఆర్థిక సహాయం అందించి క్షయరహిత జిల్లా కొరకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన నిమిత్తం రూపొందించిన ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే ఎఎస్‌పి కార్యాలయంలో టిబి ముక్త్ భారత్ అభియాన్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్షయ వ్యాధి అధికారి డాక్టర్ శరత్, ప్రభుత్వ వైద్యులు లక్ష్మీ ప్రసన్న, వికాస్, అశోక్, స్నేహ, టీవీ సూపర్వైజర్ జయప్రకాష్, శివరాం, జగన్ తదితరులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి రాఘవేంద్ర, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమాన్ని ప్రారంభించి టిబి వ్యాధిని అరికడుతామని అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి.పర్యవేక్షకులు ప్రభాకర్, నాగిరెడ్డి, దయాలన్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఖలీల్ మదనపల్లె టి.బి.యూనిట్ సిబ్బంది శాంతి, వనజ కుమారి, సుశీల, తరుణ్, సునీత పాల్గొన్నారు. **కలకడ:** నూరు రోజుల్లో టిబిని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి డాక్టర్ ఎంవి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్ బాబు, పిహెచ్ఎన్ సుబ్బరత్న, హెల్త్ సూపర్వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డమ్మ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్ సోని అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆసిఫ్, హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, సిబ్బంది భూపతి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు

టమోటా మార్కెట్‌ను మరో చోటుకు తరలించండి

- నిరసనలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నీరుగట్టువారిపల్లిలో నిర్వహిస్తున్న టమోటా మార్కెట్ యార్డును ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మార్కెట్ యార్డును మరో ప్రాంతానికి తరలించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలని నినాదాలు చేశారు. అనంతరం ఎఒ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్కెట్ యార్డుకు మదనపల్లె మండలంతో పాటు కురబలకోట, నిమ్మనపల్లె, రామసముద్రం, బి.కొత్తకోట, పిటియం, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, గుర్రంకొండ మండలాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి చిత్తూరు జిల్లా మండలాల రైతులు టమోటాలను తరలించి విక్రయిస్తున్నారన్నారు. ఇక్కడ నుంచి టమోటాలను కొనుగోలు చేసిన వ్యాపారులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మార్కెట్ యార్డు పట్టణ నడిబొడ్డున, చెన్నై, ముంబయి జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో రోజూ వేలాది వాహనాలు మార్కెట్ రావడం వల్ల ట్రాఫిక్ స్తంభించి పోతుందని చెప్పారు. మార్కెట్ యార్డు నుంచి కదిరి రోడ్డులోని రింగ్ రోడ్డు వరకు, మినీ బైపాస్ రోడ్డులోని చౌడేశ్వరి గుడి వరకు వందలాది వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి పట్టణంలోకి వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, కూలీలు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పట్టణ నడిబొడ్డున ఉన్న మార్కెట్ యార్డును బయట ప్రాంతానికి తరలించి, పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, అఫ్రిద్, జయబాబు, ఐటీయుసి కన్వీనర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును మార్చాలని నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

'ఉపాధి' డబ్బులు చెల్లించాలని నిరసన

ఉపాధి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న తమకు కూలి ఇవ్వకుండా అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని, తమకు డబ్బులు ఇచ్చి ఆదుకోవాలని నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లి పంచాయతీ, గుండ్లబురుజు గ్రామస్తులు వేడుకుంటున్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధిమేట్ మాణిక్యం మాట్లాడుతూ దళితులమైన తమకు వ్యవసాయ పనులు లేకపోవడంతో గ్రామంలో సుమారు 45 మంది ఉపాధి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. నాలుగు నెలలుగా తమకు కూలి అందడం లేదని చెప్పారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో కుటుంబాలు గడవడం భారంగా మారిందని, డ్వాక్రా గ్రూపుల్లో డబ్బులు కట్టలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో పిల్లలకు బట్టలు కొనివ్వడం, పుస్తకాల కొనడం వంటి ఎన్నో ఖర్చులు ఉన్నాయన్నారు. తాము నాలుగు నెలలుగా 45 మంది కష్టపడి పనులు చేశామన్నారు. ఒక్కొక్కరికి రూ. 15 వేలపైనే బకాయిలు ఉన్నాయని, తాము ఆ కూలిపైన ఆధారపడి జీవిస్తున్నామన్నారు. వెంటనే అధికారులు స్పందించి తమకు బకాయి ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరారు. వీ నిరసనకు సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మద్దతు తెలిపి వారితో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న వీరికి వెంటనే డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి ఉపాధి కూలీలకు బడ్జెట్ నిధులు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పక్కదారి మళ్లించి ఉపాధి కూలీలకు డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పద్ధతి కాదని ఉపాధి కూలీలకు వెంటనే డబ్బులిచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎఒ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు చిన్నప్పయ్య, ప్రసాద్, చంద్ర, వీరప్ప, రామలక్ష్మమ్మ, కల్పన, సుజాత, అలివేలమ్మ, మంజుల, రాజమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ఘనంగా ఐకాన్ స్టార్-25 వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎఆర్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం కళాంజలి గార్డెన్స్‌లో ప్రముఖ నృత్య కళాకారుడు బొజ్జా అభిరామ్ ఆధ్వర్యంలో ఐకాన్ స్టార్-2025 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అనంతరం వేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్య, సాంస్కృతిక, జానపద, యుద్ధ విద్య కళలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఒకే వేదికపై నృత్యం, సంగీతము, చిత్రలేఖనం, మార్షల్ ఆర్ట్స్ వంటి యుద్ధ విద్యలను ప్రదర్శించడం అత్యద్భుతమని కితాబు ఇచ్చారు. డాన్స్ మాస్టర్ బొజ్జ అభిరామ్ అకుంఠిత దీక్షతో కళలను అన్నిటిని ఒకే చోటుకు చేర్చి శిక్షణ ఇవ్వడంతో పాటు అత్యద్భుత ప్రదర్శనను ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ నాయుడు, కౌన్సిలర్ శనిశెట్టి నవీన్ కుమార్, రాఘవేంద్ర వర్మ, డైరెక్టర్ నాగమణి రెడ్డి, నాట్య విజ్ఞాన్ ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ కళా అశోక్, వినయ్ కుమార్, ఎపి ఎఆర్‌పిఎస్ జిల్లా నాయకులు బొజ్జా పెంచలయ్య, సీనియర్ డ్యాన్స్ మాస్టర్ రానా ప్రతాప్, సినీ కొరియోగ్రాఫర్ హరీష్, శాస్త్రీయ నృత్య గురువు బాబు, శ్రీకాంత్ స్టూడియో అధినేత శ్రీధర్, సప్తస్వర అధినేత బండ్ల రాజేష్, స్టూడియో సుబ్బు, నాగ, రాజా, అఖిల్ పాల్గొన్నారు.

పసుపులేటి హరిప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన పార్టీ ఆంధ్ర ఎపిసి సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జనసేన పార్టీ అన్నమయ్య జిల్లా సమన్వయకర్త అతికారి కృష్ణ సోమవారం తన అనుచరులతో కలిసి విజయవాడ లేపాక్షి కార్యాలయం పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జోగినేని మణి, కె.ఎస్ నరసింహ, ఎలక్ట్రికల్ రమణ పాల్గొన్నారు.

కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపుతున్న జగన్

- వైసిపి మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి కరీముల్లా

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వైసిపి శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నారని ఆపార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎస్.ఎ.కరీముల్లా అన్నారు. తన సతీమణి 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానాతో కలిసి సోమవారం తాడేపల్లిలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కరీముల్లా దంపతులు మాట్లాడుతూ రాజకీయాలలో విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేసిన నాయకుడు వైఎస్ జగన్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల అనంతరం ఆయన మనోధైర్యం కోల్పోకుండా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడూ ఎండగడుతున్నారన్నారు. తనను కలవడానికి వస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరిస్తూ జగన్ 2.0లో అందరికీ న్యాయం చేస్తామని భరోసా కల్పిస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న జగన్ ఐదేళ్లలో సంక్షేమ పాలనకు సరైన నిర్వచనం తెలిపారన్నారు. మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా పలకరించారని, జగనన్న ఆప్యాయతను చిరకాలం గుర్తుంచుకుంటామ ని చెప్పారు. 2029లో మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని వారు స్పష్టం చేశారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన ఎస్ఎ కరీముల్లా, షబానా దంపతులు

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఎఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

విద్యను వ్యాపారం చేసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిభందనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తోందని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మదనపల్లె మండల కేంద్రంలో ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్ కేవలం అడ్మిషన్ ఫీజు పేరుతో రూ. 20,000 వసూలు చేస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదవాలంటే హాస్టల్ ప్లస్ కళాశాల చదువుతో కలిపి రూ. 2,80,000 చెల్లించుకోవాలని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదవాలంటే అందని ద్రాక్షేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు నియంత్రణ చట్టాన్ని తీసుకొస్తామని చెప్పి ఎక్కడా అమలు చేయలేదని వాపోయారు. యూనిఫారం, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ, క్యాంటీన్ పేరుతో ఇతర ఖర్చులు కూడా వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్త మాంసాలను పీల్చిపిప్పి చేస్తున్నారన్నారు. ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్ పై ఫీజు నియంత్రణ చట్టం చేసే పద్ధతులు ఉండాలన్నారు. సిబిఎస్‌సి బోర్డ్ అనుమతులను ఎక్కడ పాటించ కుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్ పై చర్యలు తీసుకునేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు సిబిఎస్ఇ బోర్డు అధికారులకు రాతపూర్వకంగా తెలియజేసి ఆ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మదనపల్లె ఎడిపై పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు మాత్రం యథేచ్ఛగా నిర్వహిస్తున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆ పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహించకుండా మూసి వేసేలా విద్యాశాఖాధికారులు ఆదేశాలు ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు కూడా అలాంటి పాఠశాలలో చేర్పించొద్దని విద్యాశాఖ అధికారులు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయాలన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు పుస్తకాలు, యూనిఫారం, స్టేషనరీ పేరుతో రూ. 8,000 నుండి రూ. 16,000 వేలు వరకు వసూలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్ పై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు కళ్ళుండీ చూడలేని, చెవులుండీ వినలేని స్థితిలో ఉన్నారని దుయ్యబట్టారు. తక్షణమే కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, ప్రేమ్ పాల్గొన్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల సంతృప్త స్థాయి పెరిగేలా అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని చెప్పారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎస్‌డిసి రాఘవేంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

క్రీడలతోనే మానసిక ఉల్లాసం : 'చింతల'

బాస్కెట్ బాల్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాస్కెట్ బాల్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బాస్కెట్ బాల్ జిల్లా సెక్రటరీ రవిచందర్ క్రీడాకారులకు మెళుకువలు, క్రీడలకు సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ ప్రతి రోజు క్రీడల్లో పాల్గొనడం వలన శరీరం ఉల్లాసంగా, మనిషి ఉత్సాహంగా ఉంటారన్నారు. క్రీడాకారులు పట్టుదలతో రాణిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు అవుతారన్నారు. వాల్మీకిపురంలో శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు పోలీస్, పిఇటి, పిడి, ఆర్మీ ఉద్యోగాల్లో చేరి మంచి స్థాయిల్లో ఉన్నారన్నారు. ఈ వేసవి శిక్షణా శిబిరంలో 30రోజుల పాటు క్రీడాకారులకు చింతల శ్రీధర్ రెడ్డి నేతృత్వంలో పాలు, గ్రుడ్లు, రొట్టెలు ఉచితంగా అందించి, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులచే శిక్షణ ఇచ్చామన్నారు. అనంతరం క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుబ్రహ్మణ్యం, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసులు రెడ్డి, విశ్వనాథ రెడ్డి, నరసింహ శాస్త్రీ, చంద్రమోహన్, సాయిభార్గవ్, హేమంత్ యాదవ్, కోచ్‌లు అంజి, కేశవ, అఫ్రోజ్, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

విభిన్న ప్రతిభావంతులకు సాధనాలు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న జీవనోపాధి సాధనాలను సద్వినియోగం చేసుకొని తమ జీవితాన్ని మెరుగు పరుచుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు రూ.4.29 లక్షల విలువైన జీవనోపాధి సహాయక ఉపకరణాలను లబ్ధిదారులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఇందులో ముగ్గురు లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ 90వేలు విలువ చేసే 3 ఎలక్ట్రికల్ రెట్రో ఫిట్టెడ్ మూడు చక్రాల స్కూటర్లు, ఇద్దరు లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ.42వేలు విలువగల 2 బ్యాటరీ ఆధారిత ట్రై సైకిళ్లు అందజేశారు. ఒక్క లబ్ధిదారుకు రూ.75 వేలు విలువ చేసే హైటెక్ హైడ్రాలిక్ కృత్రిమ కాలు తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ఆదుకునేలా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు వసతులు అందిస్తున్నారిన తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ ఈ వాహనాలు, కృత్రిమ కాలు వారి స్వయం ఉపాధికి తోడ్పాటును అందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి. కృష్ణ కిషోర్, వారి సిబ్బంది, జిల్లా అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు ఎస్‌జిటిలచే భర్తీ చేయాలి

- నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులను కేటాయించారని, వాటిని ఎస్‌జిటిలతోనే ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేయాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడల్ ప్రాథమిక పాఠశాలలకు కేటాయించిన ప్రధానోపాధ్యాయుల పోస్టును వందశాతం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని, అలాకాకుండా పాఠశాల సహాయకుల స్థాయిని తగ్గిస్తూ వారిని తాత్కాలిక ప్రాతిపదికన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నియమించడం ద్వారా అటు విద్యావ్యవస్థకు, ఇటు ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు తీసుకుని వచ్చే చర్యని పేర్కొన్నారు. ఈ చర్యను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టేలోగా సరిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలియజేశారు. పాఠశాల సహాయకుల సేవలను కేవలం ఉన్నత పాఠశాలలోనే వినియోగించుకుని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను డైరెక్టర్ రిక్రూట్మెంట్ ద్వారా కాకుండా ఉద్యోగోన్నతుల ద్వారానే పూర్తి చేయాలని ఆయన కోరారు. మిగిలిన పాఠశాల సహాయకులను తాత్కాలికంగా నియమించినప్పటికీ భవిష్యత్‌లో వీరి స్థానంలో సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌టిఎ ముఖ్య నాయకులు నల్లమల రామాంజులు, పక్కీరా, కులశేఖర్ రెడ్డి ,సుబ్రమణ్యం, అర్.వి. రమణ, రాజేంద్ర నాయుడు, ఆరిఫుల్లా, వెంకట్రామ రాజు, శ్రీనివాసులు, నాగేశ్వర రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస రాజు

మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పుల్లంపేట

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమలను నిర్మూలించుట ద్వారా మలేరియాను అరికట్టవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మనోజ్ చంద్ర అన్నారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి స్థానిక వైద్యాధికారిణి శ్రీనిజ ఆధ్వర్యంలో సిహెచ్‌ఒ రాజా పర్యవేక్షణలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మనోజ్ చంద్ర మాట్లాడుతూ క్లాస్ ప్లాస్మోడియం జాతికి చెందిన ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరం వస్తుందని చలి వణుకు వంటి నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజు మార్చి రోజు వస్తుందని ఈ యొక్క ఈ జ్వరం వచ్చినప్పుడు వెంటనే దగ్గర్లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఆర్డిటి కిట్టు ద్వారా గాని, రక్త పూత పర్యవేక్షణ ద్వారా గాని మలేరియా వ్యాధిని నిర్ధారించవచ్చని డాక్టర్ సలహా మేరకు14 రోజులు మందులు వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని పేర్కొన్నారు. నివారణ చర్యల్లో భాగంగా ఇంటి వద్ద, నీటి కుళాయిల వద్ద నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని వారానికి ఒకసారి డ్రైడే ఫ్రైడే పాటించాలని, దోమతెరలు వాడాలని, మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి కృష్ణయ్య పర్యవేక్షణలో నాలుగు వసతి గృహాలలోను, ఎపి మోడల్ స్కూలు, కెజిబివై, ఎస్‌సి, బిసి బాలుర బాలికల వసతి గృహం ఎసిఎం ఐదు శాతం రసాయన ద్రావణాన్ని పిచికారి చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం మల్లపు శివరాములమ్మ, లక్ష్మీదేవి, కెవి సుబ్బా రెడ్డి, ఆశ కార్యకర్తలు ప్రమీల, లక్ష్మీదేవి, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-పుల్లంపేట

మహిళల సమస్యలపై పోరాటం చేస్తామని టిడిపి నాయకులు బాలరాజు సంపూర్ణ సౌభాగ్యవతి తెలిపారు. సోమవారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్‌ను కలిసి అభినందనలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో మహిళల సమస్యలు ఏమైనా ఉంటే మీ దృష్టికి తీసుకువస్తానని పేర్కొన్నారు. అందుకు ఎస్ఐ శివకుమార్ స్పందించి మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను, తమ దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

తులసిరెడ్డిని కలిసిన శ్రీనాథ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిసిసి కార్యవర్గ సభ్యులు అత్తింజేరి శ్రీనాథ్, ఆయన మిత్ర బృందం సుధాకర్, శ్రీనివాస్ సోమవారం వేంపల్లిలో పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పలని సుబ్రమణ్యం స్వామి ప్రసాదాన్ని తులసిరెడ్డికి అందజేశారు. రాజంపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై, నియోజక వర్గం సమస్యలపై చర్చించుకున్నట్లు శ్రీనాథ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అటు వైసిపి, ఇటు కూటమి పార్టీలు పూర్తిగా వైఫల్యం చెందాయని, ప్రజలు మళ్లీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తులసిరెడ్డి అన్నట్లు శ్రీనాథ్ తెలియజేశారు. నిరాశా, నిస్పృహలకు లోను కాకుండా అన్నమయ్య ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, రైతాంగ సమస్యలు, గల్ఫ్ దేశాలలో ఉన్న వారి సమస్యలపై పోరాడాలని సూచించినట్లు పేర్కొన్నారు.

ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

11 నెలల పసిపాపకు కొండంత కష్టం

సాయం చేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యుల ఆవేదన

ప్రజాశక్తి - పుల్లంపేట

చికిత్స పొందుతున్న చిన్నారి (ఫైల్)

మండల పరిధిలోని దలవాయిపల్లి గ్రామానికి చెందిన ఆలియా బాబ్జి కలిగిన ఈ 11 నెలల చిన్నారికి కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుం టోంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు...ఈ పాపకి మెదడు ఎదుగుదల లేదని నాలుగు రోజులుగా ఫిట్స్ సమస్య మొదలైందని రోజుకి 7 నుంచి 8 సార్లు ఫిట్స్ వస్తున్నాయని డాక్టర్ చెబుతున్నారని తెలిపారు. తమ కుటుంబం చాలా పేద కుటుంబమని, పాప పరిస్థితి చాలా విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికిత్స పొందుతున్న చిన్నారికి వైద్యానికి సుమారు రూ.ఆరు లక్షలు ఖర్చు అవుతుందన్న వైద్యులు దాతల సాయం కోరుతున్న నిరుపేద తల్లిదండ్రులకు ఎవరైనా తగు సహాయం చేయాలని మనవిచేస్తున్నారు.


పల్లవోలులో పైప్‌లైన్ లీకేజీతో ఏర్పడిన గుంత

ఆర్‌టిపిపి పైప్‌లైన్‌కు పెరిగిన లీకేజీలు

ప్రజాశక్తి - చాపాడు : మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి పొడవునా పలు ప్రాంతాల్లో ఆర్‌టిపిపి పైప్‌లైన్‌కు అధికంగా లీకేజీలు ఏర్పడ్డాయి. నీరు వృథాగా పోవడమే కాకుండా ఆ ప్రాంతాల్లో అపరిశుభ్రత చోటు చేసుకుంటుంది. పల్ల వోలులో సచివాలయ సమీపంలో లీకేజీ ఏర్పడింది. ప్రస్తుతం నీరు అధికంగా బయటకు వస్తూ లోతట్టు ప్రాంతాల్లో నిలుస్తోంది. వృద్ధాశ్రమం వద్ద కూడా నీరు వృథాగా పోతోంది. ఈ ప్రాంతంలో భూమి కుంగి నీటి తొట్టి లోనికి కుంగిపోతోంది. బిమఠం బ్రహ్మాసాగర్ నుండి ఆర్‌టిపిపికి నీటి అవసరాల కోసం పైపులైను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పల్లవోలులో నీటిని డ్రెయినేజీ కాలువకు అనుసంధానం చేయడంతో సమస్య కాస్త తగ్గుముఖం పట్టింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కాశీనాయన వృధాశ్రమం వద్ద ప్రారంభంలో చిన్నపాటి లీకేజీ ఏర్పడి తర్వాత అధికంగా నీరు వచ్చేది. కాబట్టి గతంలో జరిగిన సంఘటన దృష్టిలో ఉంచుకొని లీకేజీలకు త్వరగా మరమ్మతులు చేపడితే ఉపయోగకరంగా ఉంటుంది.

నిరుద్యోగ భృతి ప్రస్తావన ఏదీ? : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్ : ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా నిరుద్యోగ భృతి పైన మహానాడులో ప్రస్తావన లేదని, అమలుకు ఎప్పుడూ చర్యలు తీసుకుంటారో తెలపాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియంచిన్ని, వీరణాల శివ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా ఇంత వరకు హామీ అమలుకు నోచుకోలేదన్నారు. కడపలో జరిగిన మహానాడులో అయిన నిరుద్యోగ భృతిపై ప్రస్తావిస్తారని నిరుద్యోగ యువత ఆశగా ఎదురు చూసారని, వారందరికీ నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగ భృతి అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. ఆదిల్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పీలేరు : ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎంఎంసి చైర్మన్, డైరెక్టర్లు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. సోమవారం స్థానిక వ్యవసాయం మార్కెట్ కమిటీ ఆవరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎడిఎం టి.త్యాగరాజ్ మొదట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పురం రామమూర్తి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత మిగిలిన పాలకవర్గ సభ్యులు పి.సురేంద్రారెడ్డి, ఎన్.సుబ్బయ్య, ఎం.కృష్ణమూర్తి, పి.రహంతుల్లా, ఎస్.శివమ్మ, ఒ.రమాదేవి, ఎం.సాధన, ఎన్.అమర్నాథ్‌రెడ్డి, కె.రవి, జి.కిషోర్ నాయుడు, ఎం.రజనిశ్రీ, ఎ.వనిత, టి.లక్ష్మీకాంతమ్మ, జి.అనురాధ, బి.నారాయణమూర్తి చేత కూడా సామూహిక ప్రమాణం చేయించారు. ప్యానెల్‌లో పీలేరు వ్యవసాయ శాఖ ఎడిఎ వై.వి.రమణరావు, గోరంట్లపల్లి సర్పంచ్ కృష్ణయ్య కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి కట్టుబడి పనిచేయాలని తెలిపారు. గత ప్రభుత్వంలో పాలకులు వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయాన్ని తమ స్వార్థానికి దోచుకుంటూ, వీటిని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల శ్రేయస్సు కోరి ఎఎంసిలకు పాలక మండలులను ఏర్పాటు చేయడంతో పాటు, నామినేటెడ్ పదవులను భర్తీ చేశారనన్నారు. పీలేరు నియోజక వర్గంలోని పీలేరు, కెవిపల్లి మండలాలకు పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ, కలికిరి, కలకడ మండలాలకు కలికిరిలోను, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల రైతుల కోసం వాల్మీకిపురంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి మౌలిక సదుపాయాలను సమకూర్చి వీటిని అన్ని విధాల అభివృద్ధి పరిచారని గుర్తు చేశారు. వాల్మీకిపురం, కలికిరి మార్కెట్ కమిటీలకు టమాటా రైతులు, వ్యాపారుల ద్వారా ఆదాయం సమకూరుతూందన్నారు. పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి అత్యంత విలువైన ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి టి.కుమార్, కార్యాలయ సిబ్బందితో పాటు టిడిపి నాయకులు నిరంజన్‌రెడ్డి, మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, కోటపల్లి బాబురెడ్డి, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెల రెడ్డిబాష, మండల పార్టీ కన్వీనర్ వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, కోటపల్లి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, బిసి నాయకులు పోలిశెట్టి సురేంద్ర, పసుపులేటి లక్ష్మీకర, టిడిపి, జనసేన, బిజెపి ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎంఎంసి చైర్‌పర్సన్‌గా మాలతి

మాలతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లారి

కలికిరి: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మాజీ జడ్‌పిటిసి మాలతి, డైరెక్టర్లుగా ముబారక్ అలీ, సనావుల్లా, శ్రీనివాస్ వర్మ, రాంబాబు, రాజగోపాల్‌రెడ్డి, తేజ, అస్లాం ప్రమాణ స్వీకారం చేశారు. కలికిరి మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో వారికి తగ్గ పదవులు వస్తాయన్నారు. ముఖ్యమంత్రి కూడా కష్టపడే వారిని గుర్తిస్తారని చెప్పారు. చైర్‌పర్సన్ మాలతి మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, నాయకులు ఎర్రం రెడ్డి, మల్‌రెడ్డి, సహదేవరెడ్డి, అగస్తీస్వర్, ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షుడు బాషా పాల్గొన్నారు.

డైరెక్టర్ ముబారక్ అలీకి సన్మానం

కలకడ : కలికిరి మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన ముబారక్ అలీని స్థానిక పార్టీ మండల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ రైతులకు అందుబా టులో ఉండి వారి సమస్యల పట్ల దృష్టి సారిస్తానన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో టౌన్ ఇన్‌ఛార్జి వైజిలానిబాషా, ఖాజా హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఇర్ఫాన్‌బాషా, ఎం.జిలానిబాషా, కరీముల్లా, మల్లికార్జున నాయుడు పాల్గొన్నారు.

అలీని సన్మానిస్తున్న నాయకులు

పిఎం సూర్యఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై ప్రజలలో అవగాహన కల్పించాలని, సోలార్ ప్యానల్స్ ఇన్స్టాలేషన్ ఖర్చు, సబ్సిడీలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి రిజిస్ట్రేషన్లు పెంచాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్యుత్ శాఖ ఎస్ఇ, ఇఇలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్స్టాల్ చేసే వెండర్లు, తదితరులతో అన్నమయ్య జిల్లాలో పిఎం సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ పవర్ ఇన్స్టాల్ చేసుకోవాలనుకునే రిజిస్ట్రేషన్లు పెరగాలని విద్యుత్ శాఖ సిబ్బందిని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పిఎం సూర్యఘర్ పథకంపై ప్రజలలో అవగాహన కల్పించాలని దానికి సంబంధించిన కార్యాచరణ రూపొందించాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రత్యేకంగా నూతన విధానాన్ని తీసుకురానున్నందున బీసీలు, ఓసీల మీద దృష్టి సారించాలని వారి దగ్గర నుండి వీలైనన్ని ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేయించాలని ఆదేశించారు. సోలార్ ప్యానల్ ఇన్స్టాలేషన్ వెండర్లు, నెడ్ క్యాప్ వారు సమన్వయం చేసుకొని ప్రజలకు అర్థమయ్యేలా పథకంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి ప్రజల నుంచి విద్యుత్ శాఖ పై తీసుకునే అభిప్రాయాలను విద్యుత్ శాఖ సిబ్బందితో చర్చిస్తూ ప్రజలలో విద్యుత్ శాఖ పట్ల మంచి అభిప్రాయం ఉండేలా, ఎఇలు ఎనర్జీ అసిస్టెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌పిడిసిఎల్ శాఖ ఇఇలు, డిఇలు, ఎడిఎలు, ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటవారికి శిక్షణతో పాటు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఇఒ పాల్గొని మాట్లాడుతూ వంట గది పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతిరోజు వంట పాత్రలు కడిగి వంట చేయాలని సూచించారు. పరిశుభ్రమైన మంచినీటితో వంట చేయాలని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో పోషక విలువలతో కూడి పిల్లల రుచికి తగినట్టుగా అనేక రకాల ఆహార పదార్థాలు మెనూలో చేర్చబడ్డాయని, తగినంత ప్రోటీన్లు, ఇతర అనుబంధ పోషకాలను అందించడానికి గుడ్లు, చిక్కి, రాగి జావ రూపంలో పోషక ఆహారం ఇవ్వబడుతుందని తెలిపారు. ప్రతిరోజు మెనూ ప్రకారం వంటలు చేయాలని సూచించారు. పిల్లల శారీరక, మానసిక పెరుగుదలకు అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో కూడిన కూరగాయలను మధ్యాహ్న భోజన మెనూలో చేర్చబడ్డాయని తెలియజేశారు. విద్యార్థులలో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నిర్మూలించడానికి, ఐరన్ లోపాన్ని పరిష్కరిస్తూ పోషకాహార ప్రమాణాలను మెరుగుపరచడానికి ఫోర్టీ ఫైడ్ బియ్యం పాఠశాలలకు అందించబడుతుందని, ఈ బియ్యం గింజలు విటమిన్లు, ఖనిజాల మిశ్రమంతో తయారు చేయబడినవన్నారు. ఇవి సాధారణ బియ్యం కంటే తేలికైనవనని, వంట చేసేటప్పుడు ఈ బియ్యపు గింజలు నీటిపై తేలుతాయని అన్నారు. వంట చేసేవారు ఆ గింజలు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వివరించారు. అనంతరం వంట పోటీలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ కార్యాలయ మెస్ కో-ఆర్డినేటర్ పి.జిలాన్ ఖాన్, సిఆర్‌పి సుబ్బరాయుడు, ఈశ్వర్ రెడ్డి, ముజఫర్ అహ్మద్, లక్ష్మీదేవి, మున్ని, వెంకట నరసమ్మ, గుల్జార్ బేగం, అవ్వరు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ సుబ్బరాయుడు

కర్నూలుపై నెల్లూరు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ -23 వన్డే క్రికెట్ టోర్నీలో భాగంగా సోమవారం వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 225 పరుగుల తేడాతో నెల్లూరు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 49.4 ఓవర్లలో 387 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కె. నిఖిలేశ్వర్ రెడ్డి 83, జి. మన్విత్‌రెడ్డి 67, సోహన్ వర్మ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని పి. కనీష్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీసుకున్నాడు. పి. సాబ్జాన్‌బాష 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 388 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 36.3 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని పి. కనిష్ 60, పి. సాబ్జాన్ బాష 41 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎన్. భార్గవ్ అద్భుతంగా బౌలింగ్ బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. ఎస్ అఖిల్ సాలుంకే 2, సయ్యద్ అతిక్ సల్మాన్ 2 వికెట్లు తీసుకున్నారు.

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్ లో కడప జట్టుపై చిత్తూరు జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 50.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఏ. శివకేశవ రాయల్ 63, సి. విజయ్ రామిరెడ్డి 35 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని మహమ్మద్ 4, పి. అచ్యుతానంద 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 262 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 49.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసి 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ 84, నికిత్ గౌడ్ 54 పరుగులు చేశారు. కడప జట్టులోని ఏ. నాగ కుళ్లాయప్ప 3, షేక్ ఆదిల్ హుస్సేన్ 2 వికెట్లు తీసుకున్నారు.

తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జట్లు

వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ప్రజలకు కూటమి పెద్దల వెన్నుపోటు : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, కూటమి పెద్దలు వెన్నుపోటు పొడిచారని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో వెన్నుపోటు నిరసన దినం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను అనేక ప్రలోభాలకు గురిచేసి మోసపూరిత హామీలతో దగా చేసిన కూటమి ప్రభుత్వ పాలన తీరుకు నిరసనగా పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 4న పీలేరులో తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలు, ప్రజలను కోరారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, మోసాలను ఎండగడుతూ రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్య కాండను, కక్ష సాధింపు పాలనను నిరసిస్తూ తలపెట్టిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నిరసనను వ్యక్తం చేయాలన్నారు. ఎన్నికల్లో చెప్పిన సూపర్ సిక్స్ హామీలలో ఏ ఒక్కటి అమలు చేయకపోగా, డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీళ్ల భాస్కర్, బిడ్డల కేశవరెడ్డి, శివారెడ్డి, అబ్దుల్ కలీమ్, ఆనంద్, లక్ష్మీనారాయణ రెడ్డి, మహబూబ్ బాషా, ముని భాస్కర్, రవీంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, అశోక్ రెడ్డి, రఘు, సైపుల్లా, మస్తాన్, అమిన్ పీర్, అషర్, ఇర్ఫాన్, రాజబాబు, శివ, విశ్వనాథ, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. **సుండుపల్లి :** కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టి ఏడాది పూర్తి కావస్తుదని, ఈ కాలంలో ప్రజలకు చేసి ఏమీ లేదని వైసిపి మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 4న నిర్వహించబోయే వెనుపోటు దినోత్సవ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బస్టాండ్ కూడలిలోని వై.ఎస్.విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెనుపోటుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆరం రెడ్డి, వైసిపి బూత్ కమిటీల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, జడ్‌పిటిసి ఇస్మాయిల్, జిల్లా గిరిజన విభాగం అధ్యక్షుడు చంద్ర నాయక్, సర్పంచ్ రామా జయచంద్ర, ఎంపిటిసిలు, నసీమా భాను, ఆదం ఖాన్, బేరిపల్లి రఫిక్, లలిశెట్టి శంకర, చింటూ రెడ్డి, బెల్లం సంజీవరెడ్డి , రాజశేఖర్ నాయక్ ,షేక్ సామి, జలీల్ పిట్టు, నాగరాజా, రషీద్, జానీ బాషా, రామాంజులుతో పాటు వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వీరబల్లి :** వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్‌ను వీరబల్లి మండల కేంద్రం బస్టాండ్ ఆవరణంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి నా యకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాలివీటి విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపిపి గాలివీటి. రాజేంద్రనాథ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైసిపి నాయకులు గాలివీటి మదన్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వివేకానందరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మణి, సర్పం చులు గోపినాథ్ రెడ్డి, శివరాం, ఎంపిటిసిలు సుబ్బరామరాజు, జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంట్ నరేష్ స్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-రామాపురం

అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, నగర ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి పట్టాలు ఇస్తూ ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు ఇస్తామని చెప్పారని పేర్కొన్నాపరు. ఇసుక, ఇనుము, సిమెంటు ధరలు పెరగడం వల్ల ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇంటి స్థలాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి సర్వే చేయాలని అర్హుల జాబితాను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర సిపిఐ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

కవి సమ్మేళనానికి శంకర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - నందలూరు

కడప జిల్లా బ్రహ్మంగారిమఠంలోని శ్రీ అచలానంద ఆశ్రమములో ఈ నెల 8వ తేదీన జరుగనున్న కవిసమ్మేళనానికి రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను గౌరవ అతిథిగా ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు కేసిరాజు గజల్ శ్రీనివాస్, కడప జిల్లా సంచాలకులు బొల్లు రామమోహన్ సంయుక్తంగా ఆహ్వానించారు. గుంటూరులో 2026 సంవత్సరం జనవరి నెలలో శ్రీ సత్యసాయి స్పిరిట్యుట్ సిటీ మైదానములో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు స్ఫూర్తి దాయకంగా బ్రహ్మంగారిమఠంలో ఉపోదాత కవి సమ్మేళనం 500 కవులతో నిర్వహించనున్నారు. తెలుగు భాషభివృద్ధికి, తెలుగు సాహిత్యభివృద్ధికి శంకర్ చేస్తున్న కృషిని గుర్తించి గౌరవ అతిధులుగా ఆహ్వానిస్తున్నామని గజల్ శ్రీనివాస్ తెలిపారు.ప్రపంచ తెలుగు మహాసభల ఉపోదాత కవిసమ్మేళనానికి తనను గౌరవ అతిధిగా ఆహ్వానించడం సంతోషంగా ఉందని డాక్టర్ శంకర్ తెలిపారు.

పాలిటెక్నిక్ పరీక్ష ఫలితాల్లో 'సాయి' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి పాలిటెక్నిక్ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు తాజా ఎస్‌బిటెట్ పరీక్షా ఫలితాల్లో అదుతేమైన ప్రతిభను కనబర్చి, అత్యధిక ఉత్తీర్ణత సాధిస్తూ కళాశాలకు ఖ్యాతి తీసుకు వచ్చారుని శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఇఇ విభాగం నుండి మేఘన 91 శాతంతో మొదటి ర్యాంకు, నాగమణి 87 శాతంతో రెండవ ర్యాంకు, సాజియా 86.54 శాతంతో మూడవ ర్యాంకు సాధించారని చెప్పారు. ఇసిఇ విభాగం నుండి టి.గౌతమి 95 శాతం తో మొదటి ర్యాంకు, స్వరూప లహరి 93 శాతంతో రెండవ ర్యాంకు, జి.గౌతమి 92 శాతంతో మూడవ ర్యాంకు సాధించి తమ ప్రతిభను చాటారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను కూడా అభినందించి, విద్యార్థుల ప్రతిభకు దోహదపడేలా కళాశాలలో అన్ని రకాల మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలకు దారితీసే శిక్షణలతో సహా అన్ని అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ఉన్నత స్థాయిలో ఎదగాలని సూచించారు. ఈ విజయం మిగతా విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, పాలిటెక్నిక్ ఇన్‌ఛార్జి వి.ప్రతాప రావు,వివిధ విభాగాల అధిపతులు,అధ్యా పకులు హర్షపూర్వకంగా అభినందించారు.

జెవివి సభ్యత్వ ప్రచారానికి శ్రీకారం

ప్రజాశక్తి- కడప అర్బన్ : జన విజ్ఞాన వేదిక సభ్యత్వ ప్రచారానికి జిల్లాస్థాయిలో శ్రీకారం చుట్టినట్లు జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్‌బాషా, బాల బయన్న పేర్కొన్నారు. సోమవారం జెవివి సభ్యత్వ ప్రచార ప్రారంభ సమావేశం సందర్భంగా ద్వారక నగర్‌లోని జెవివి కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి జులై 15 వరకు జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. సభ్యత్వ పుస్తకాలు నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశామని చెప్పారు. వీటి ద్వారా గ్రామస్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. జన విజ్ఞాన వేదిక ప్రజలలో శాస్త్ర దృక్పథాన్ని, తర్కబద్ధమైన ఆలోచనను ప్రోత్సహించే ప్రజా శాస్త్ర సంస్థ అన్నారు. మూఢనమ్మకాలు, అజ్ఞానాన్ని నిర్మూలించేందుకు బహుళ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో ప్రతి విజ్ఞాన ప్రియుడి పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వీలైనంత ఎక్కువమంది సభ్యులను నమోదు చేసి శాస్త్రీయ చైతన్యాన్ని మరింత విస్తృత పరచాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు శివరాం, సభ్యులు సునీత, నరసింహారెడ్డి, ప్రకాష్, దస్తగిరి రెడ్డి, గౌరీ శంకర్, గోవిందు పాల్గొన్నారు.